# మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 19, ప్రజా జ్యోతి:** జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక


ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 20 | నవంబర్ | 2025 ◆ పేజీలు : 8




దండకారణ్యంలో దశాబ్దాలుగా సాగిన మావోయిస్టు సాయుధ పోరాటానికి ముగింపు సంకేతాలు కనిపిస్తున్నాయి. అబూజ్ మాడ్ కోర్ జోన్ ను లక్ష్యంగా చేసుకుని మూడు సంవత్సరాలుగా నడుస్తున్న ఆపరేషన్ కగార్ ఇప్పుడు కీలక దశలోకి చేరింది. మారేడుమిల్లి అరణ్యంలో టాప్ కమాండర్ హిడ్మా మృతి మావోయిస్టు యుద్ధ వ్యూహానికి అతిపెద్ద చీలికగా భద్రతా దళాలు చూస్తున్నాయి. అడవుల్లో పాత జోన్లు కూలిపోవడం, సరుకు మార్గాలు తెగిపోవడం, నాయకత్వం చెల్లాచెదరవడంతో దశాబ్దాల మావోయుగం ముగింపునకు చేరువలో ఉందని ఇంటెలిజెన్స్ అంచనాలు వేస్తోంది. హిడ్మ మరణం మావో చివరి దశ పోరుబాటకు ఒక పెద్ద మలుపుగా పలునురు భావిస్తున్నారు. దీంతో గత మూడేళ్ళుగా కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల సమన్వయంతో నడుస్తున్న ఆపరేషన్ కగార్ లక్ష్యం పూర్తిగా ఫలిస్తోంది.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# మావో యుగానికి ... ముగింపు సంకేతం..!?

2 లో..

● కగార్ చివరి దశలో మావోయిస్టులకు భారీ దెబ్బ ● హిడ్మా పతనంతో బెటాలియన్–1 కుదేలు ● అరణ్యంలో మావో బలగాలకు మూసుకున్న మార్గాలు ● నక్సలిజంను నులమేసిన భారీ కంబైన్డ్ ఆపరేషన్.. ● అడవిలో చివరి దశ యుద్ధం ?

# ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీతో సింగరేణి ఒప్పందం...

- ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ అమ్మకంలో సహకారానికి అంగీకారం
- సింగరేణి సీఎండీ బలరామ్ సమక్షంలో ఒప్పందం



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 19 ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ పునరుద్పాదక ఇంధన రంగంలో విద్యుత్ ప్రాజెక్టులను పెద్ద ఎత్తున చేపట్టబోతున్న నేపథ్యంలో ప్రముఖ జాతీయ స్థాయి విద్యుత్ ఉత్పాదక సంస్థ ఎన్టీపీసీ వారి అనుబంధ కంపెనీ ఎన్ జీ ఈ ఎల్ (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్) తో ఒక కీలక ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం హైదరాబాద్ లో జరిగిన ఒప్పంద కార్యక్రమంలో సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ తో పాటు సంస్థ డైరెక్టర్లు, ఎన్ జీ ఈ ఎల్ తరపున ఉన్నతాధికారులు ఆర్. మౌర్య, బిమల్ గోపాల చారి పాల్గొన్నారు. ఒప్పంద వివరాలను సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎన్. బలరామ్ వివరిస్తూ... మిగతా 2 లో...

# చింతగుప్పలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం. వెంకటరావు, ఐటిడిప పిఓ బి రాహుల్
- విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు
- గిరిజన విద్యార్థులకు అండగా ఉంటాం -ఐటీడీఏ పీవో బి .రాహుల్



**చర్ల, నవంబర్ 19 (ప్రజాజ్యోతి):** చర్ల మండలంలో బుధవారం బోధనల్లి పంచాయతీ పరిధిలోని చింతగుప్ప గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మిగతా 2 లో...

## ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీతో సింగరేణి ఒప్పందం...

(మొదటి పేజీ తరువాయి...)

సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా పలు పునరుద్పాదక ఇంధన రంగంలో ప్లాంట్లను నెలకొల్పాలని నిర్ణయించిందని, జాతీయ స్థాయిలో విద్యుత్పాదనలో దశాబ్దాల అనుభవం ఉన్న ఎన్టీపీసీ సహకారాన్ని తీసుకోదలచామని, ఎన్టీపీసీ సంస్థ గ్రీన్ ఎనర్జీ ఉత్పాదన కోసం ఏర్పాటు చేసిన ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సింగరేణి సంస్థ మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, అలాగే సోలార్ విద్యుత్తును 5 వేల మెగావాట్లకు పెంచాలని నిర్ణయించిందని, మణుగూరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ కూడా నిర్మించాలన్న లక్ష్యంగా ముందుకు పోతున్నామన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో అపార అనుభవం గల ఎన్టీపీసీ తోనూ అనుబంధ సంస్థ అయిన ఎన్ జి ఈ ఎల్ కంపెనీ తోనూ ఒప్పందం కుదుర్చుకోవడం ఒక శుభ పరిణామం అన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటులో సాంకేతిక సహాయం లేదా ఉమ్మడి భాగస్వామ్యం అంశం కూడా పరిశీలిస్తున్నామన్నారు. భవిష్యత్ లో సింగరేణి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ల ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును విక్రయంలోనూ ఎన్టీపీసీ సహకారం తీసుకోనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్ జీ ఈ ఎల్ ఉన్నతాధికారి బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ బిమల్ గోపాలాచారి, హెడ్ (సివిల్ ఇంజినీరింగ్) ఆర్.ఆర్.మౌర్యలు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలోకి కూడా ప్రవేశించడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. తాము కూడా గ్రీన్ ఎనర్జీ వైపు వేగంగా అడుగులు వేస్తున్నామని ఇరువురి పరస్పర సహకారం మరియు భాగస్వామ్యంతో దేశ విదేశాల్లో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒప్పందం అనంతరం ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహిస్తామని ఇరు పక్షాలకు లాభదాయకమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు. 13 దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణితో కలిసి నడవడం ఆనందంగా ఉందని అన్నారు. సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం తిరుమలరావు, ఈడీ (ఎన్టీపీపీ) చిరంజీవులు, జీఎం (కోఆర్డినేషన్, మార్కెటింగ్) తాడబోయిన శ్రీనివాస్, జీఎం విశ్వనాథ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ జిల్లాలో నమోదవుతున్న కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల వాడకం నియంత్రణ, శాఖలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల సమాజంపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని, శాఖలు నిరంతర పర్యవేక్షణతో కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న చైతన్యం కార్యక్రమం ద్వారా యువతలో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో దీనిని మరిన్ని గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలకు విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. యువతను మాదకద్రవ్యాల వైపు మళ్లకుండా ఆరోగ్యకరమైన దిశలో నడిపేందుకు శని, ఆదివారాల్లో క్రీడా కార్యక్రమాలు, జుంబా డాన్స్, ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పాల్వంచలోని శ్రీనివాస గుట్టలో ప్రత్యేక ట్రెక్కింగ్ కార్యక్రమం చేపట్టి, అక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. అటవీశాఖ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం వనవిహారాల్లో కుటుంబాలు, పిల్లలు ఉపయోగించే సౌకర్యాలను మరింత విస్తరించాలని కలెక్టర్ సూచించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు కనిపించిన వెంటనే సమాచారాన్ని పోలీసులకు చేరవేసి తక్షణ చర్యలు నిర్ధారించాలని తెలిపారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి, వారికి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందించేందుకు డీ–అడిక్షన్ సెంటర్ల పనితీరును బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపుల్లో ఔషధాల స్టాక్ వివరాలను ప్రతి నెల క్రమం తప్పకుండా తనిఖీ చేసి, అక్రమ విక్రయాలను అరికట్టాలని డ్రగ్ ఇన్ స్పెక్టర్ కు ఆదేశించారు. ఇంటర్ కళాశాలల్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, విద్యార్థుల్లో మాదక ద్రవ్యాలపై చైతన్యం పెంచాలని సూచించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగించిన లేదా సాగు చేపట్టిన, సరఫరా చేసిన ఆ వివరాలను 1908 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, పోలీస్ , అటవీశాఖ అధికారులు, డ్రగ్ కంట్రోల్ శాఖ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మావో యుగానికి ముగింపు సంకేతం..!?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 19, ప్రజాజ్యోతి:** దండకారణ్యంలో దశాబ్దాలుగా సాగిన మావోయిస్టు సాయుధ పోరాటానికి ముగింపు సంకేతాలు కనిపిస్తున్నాయి. అబూజ్ మాడ్ కోర్ జోన్ ను లక్ష్యంగా చేసుకుని మూడు సంవత్సరాలుగా నడుస్తున్న ఆపరేషన్ కగార్ ఇప్పుడు కీలక దశలోకి చేరింది. మారేడుమిల్లి అరణ్యంలో టాప్ కమాండర్ హిడ్మా మృతి మావోయిస్టు యుద్ధ వ్యూహానికి అతిపెద్ద చీలికగా భద్రతా దళాలు చూస్తున్నాయి. అడవుల్లో పాత జోన్లు కూలిపోవడం, సరుకు మార్గాలు తెగిపోవడం, నాయకత్వం చెల్లాచెదరవడంతో దశాబ్దాల మావో యుగం ముగింపునకు చేరువలో ఉందని ఇంటెలిజెన్స్ అంచనాలు వేస్తోంది. హిడ్మ మరణం మావో చివరి దశ పోరుబాటకు ఒక పెద్ద మలుపుగా పలునురు భావిస్తున్నారు. దీంతో గత మూడేళ్ళుగా కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల సమన్వయంతో నడుస్తున్న ఆపరేషన్ కగార్ లక్ష్యం పూర్తిగా ఫలిస్తోంది. వాళ్ళ ప్రణాళిక ప్రకారం అబూజ్ మాడ్ కోర్ జోన్ లో ఉన్న మావోయిస్టు బలగాలను పూర్తిగా ఛేదించడం, అడవుల్లో దశాబ్దాలుగా చేసిన మిలిటరీ స్ట్రాంగ్ హోల్డ్స్ ను ఒక్కొక్కటిగా విచ్ఛిన్నం చేయడం పూర్తి చేశారు. దీంతో గతంలో ప్రభుత్వ యాంత్రిక బలగాలు అడుగుపెట్టలేని పర్వత మార్గాలే ఇప్పుడు డిఆర్జి, కోబ్రా, గ్రేహౌండ్స్ సంచలన తూటాల బాటగా మారాయి.

### ♦ కగార్ ప్రభావంతో విచ్ఛిన్నం..

ఈ పరిణామాలతో దండకారణ్యంలోని భద్రతా బలగాల వ్యూహం కొత్త దిశలోకి మళ్లింది. మావోయిస్టుల కోర్ జోన్ లో గత మూడేళ్లుగా నమోదైన కదలికలు, జరిగిన మిలిటరీ తాకిడులు, చెదరిపోయిన నాయకత్వ చక్రం అన్ని కలిపి ఆపరేషన్ కగార్ ను నిర్ణాయక దశలోకి నెట్టాయి. ఇంటెలిజెన్స్ అంచనాల ప్రకారం 2021లో ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టుల కేడర్ సంఖ్య 40 నుండి 45 శాతం వరకు క్షీణించింది. అబూజ్ మాడ్ అరణ్యాల్లో బస చేస్తున్న అడవి దళాలకు సరుకు మార్గాలు ఎక్కువమేర మూసుకున్నాయి. దీంతో లోయల్లో ఉన్న సీక్రెట్ క్యాంపులు ఖాళీ అయ్యాయి. వాటితో పాటు నాయకత్వంలో విభేదాలు మరింత పెరిగినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అందుకే ఈ ఒత్తిడిలో హిడ్మా వంటి అగ్ర నేతలు సరిహద్దు అరణ్యాల్లోకి కదలికలు మొదలుపెట్టారు. అయితే అదే కదలిక అతడికి చివరి అడుగు అయింది. చివరి వారం పాటు అతడి కదలికలపై స్పష్టమైన లీడ్స్ ఇన్టెలిజెన్స్ కు దొరికినట్లు సమాచారం. కొత్త నియామకాల కోసం సమావేశం పెట్టిన ప్రదేశాన్ని "లో ఇన్ డెన్సిటీ ఫారెస్ట్" గా గుర్తించారు. గ్రేహౌండ్స్ ట్రాక్ ఫిక్స్ చేసి చుట్టుముట్టిన తర్వాతే ఎన్కౌంటర్ ప్రారంభమైందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

### ♦ ఇక చివరి దశ..

మంగళవారం జరిగిన ఆపరేషన్ ను అధికారులు "కగార్ ఫేజ్–3లో అతి పెద్ద విజయ సంకేతం"గా చూస్తున్నారు. హిడ్మా మరణంతో బెటాలియన్–1లో నాయకత్వ శూన్యం క్రియాశీలమయ్యే అవకాశం ఉంది. దళాల్లో గందరగోళం, వ్యూహాల కుంచితం ఇవన్నీ మావోయిస్టు ప్రభావాన్ని మరింత తగ్గించే దిశగా వాళ్ళు పరిగణిస్తున్నారు. దాంతో పాటు అతడి వద్ద ఉన్న డిజిటల్ నోట్ లు, అడవి మార్గాల మ్యాప్ లు ఇప్పుడు భద్రతా దళాలకు కీలక ఆధారాలుగా భావిస్తున్నారు. దీంతో ఇక అడవిలో యుద్ధం చివరి దశకు చేరినట్టేనని దేశమంతా భావిస్తోంది. ముఖ్యంగా హిడ్మా పతనం తర్వాత అబూజ్ మాడ్ నుంచి సుక్మా–బీజాపూర్ వరకూ ఉన్న స్ట్రాంగ్ హోల్డ్స్ పై భద్రతా దళాలు మరింత దూకుడుతో ముందుకు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అరణ్యంలో మావోయిస్టుల పాత వ్యూహాలు కూలిపోయాయి. దీంతో కగార్ చివరి దశ యుద్ధానికి దారితీసిన వేళ.. మావో యుగానికి ముగింపు సంకేతాలు కనబడుతున్నాయి.

### ♦ జన జీవన ప్రవాహం లోకి..

ఆపరేషన్ కగార్ మూడేళ్ల ప్రవాహంలో అడవుల్లో ఒక్కొక్కటిగా కూలుతున్న కోటలు ఇప్పుడు చివరి దశలో నిలిచినవి కొన్ని మాత్రమే. అబూజ్ మాడ్ అరణ్యం ఒకప్పుడు "ముట్టరాని కోర్ జోన్"గా నిలిచినా, ఇప్పుడు భద్రతా దళాల నిరంతర కదలికలతో తెరుచుకుంటోంది. దళాలు ఏర్పాటు చేసిన కొత్త బేస్ క్యాంపులు, డీప్ పేట్రోలింగ్, ఎయిర్ సర్వేలన్స్.. ఇవన్నీ మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా తగ్గించే దిశగా పని చేస్తున్నాయి. ఒక్క హిడ్మా మృతి ఈ సమస్త పరిణామాలకు వేగం జోడించినట్టే అయ్యింది. నాయకత్వ శూన్యం, అంతర్గత విభేదాలు, లాజిస్టిక్స్ వ్యవస్థ క్షీణత ఇవన్నీ కలిపి మావోయిస్టుల అరణ్య బలగాలను పూర్తిగా ముగింపు స్థితిలోకి నెట్టేశాయి. లోయల్లో కొత్త గా ఏర్పాటు అవుతున్న రోడ్ల నిర్మాణం, పల్లె గ్రామాల వరకు చేరిన అభివృద్ధి మార్గాలు, ప్రత్యేక భద్రతా శిబిరాలు ఈ అన్ని మార్పులు ప్రజలను మళ్లీ ప్రధాన జన జీవన ప్రవాహంలోకి తెస్తున్నా యి. ఒకప్పుడు మావోయిస్టుల సమాచార కేంద్రాల్లా పని చేసిన దూర పు పల్లెలు ఇప్పుడు భద్రతా దళాలపై విశ్వాసంతో ముందుకు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటివరకూ మూడు దశలుగా సాగిన కగార్, నాలుగో దశలో నిర్ణయాత్మక ముట్టడిగా మారవచ్చన్న సంకేతా లు స్పష్టంగా వినిపిస్తున్నాయి. దీంతో అరణ్యం నెమ్మదిగా కొత్త పటా న్ని ఎంచుకుంటోంది, దండకారణ్యం మధ్యగుండెలో దశాబ్దాలుగా కొనసాగిన పోరాట శకం ఇప్పుడు ఎండలో మసకబారుతున్న నీడలాగే కనిపిస్తోంది.

## చింతగుప్పలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి...)



నూతన భవన ప్రారంభోత్సవానికి భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు, ఐటీడీఏ పీవో బి రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పిఓ బి రాహుల్ మాట్లాడుతూ గిరిజన చిన్నారుల విద్యాభ్యాసం పునాది నుండే బలోపేతం కావడానికి చిన్నారుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తుల సహకారం కూడా ఉంటే పిల్లల విద్యాభ్యాసం సక్రమంగా జరగడమే కాక పై చదువులకి వెళ్లిన వారు ఎటువంటి భయాందోళనలు లేకుండా మంచిగా చదివి వారి భవిష్యత్తును తీర్చిదిద్దు కుంటారని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం చర్ల మండలంలోని చింతగుప్ప గ్రామంలో గిరిజన చిన్నారుల కోసం 14 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన జిపిఎస్ పాఠశాల భవనాన్ని గ్రామస్తుల సమక్షంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావుతో ఐటిడీఏ పీ ఓ బి రాహుల్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ జిపిఎస్ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల విద్యాభ్యాసం బలోపేతం కావడానికి ఉద్దీపకం వర్క్ బుక్ ను ప్రవేశపెట్టడం వలన చాలావరకు చిన్నారులు అన్ని రకాల తెలుగు పదాలు గణితం ఇంగ్లీషుకు సంబంధించిన అంశాలు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. గిరిజన చిన్నారుల విద్యాభ్యాసం మెరుగుపడడానికి ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో ఈ చిన్నారులకు వారి విద్యకు సంబంధించి కొత్త కొత్త ప్రణాళికలు రూపొందించి మరింత బలపడే విధంగా ప్రయత్నిస్తున్నామని అన్నారు. అలాగే ప్రతి మారుమూల ప్రాంతంలో గిరిజన చిన్నారులు ఎవరైనా ఉంటే వారికి ఐటిడిఏ తరుపున జిపిఎస్ పాఠశాలలు ఏర్పాట్లు చేసి చదువుకునే విధంగా చూస్తామని, పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా పిల్లలందరూ పాఠశాలకు వెళ్లే విధంగా చూడాలని, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న ప్రతి పాఠశాలలో చక్కటి విద్యతో పాటు సమయానుకూలంగా భోజనం దుస్తులు పుస్తకాలు అన్ని రకాల కాస్మోటిక్ చార్జీలు అందిస్తున్నామని, తల్లిదండ్రులు మాత్రం పిల్లలను నిర్లక్ష్యంగా ఇంట్లో ఉంచుకోకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని అన్నారు. అనంతరం భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు మాట్లాడుతూ గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభ్యాసం కొరకు ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక వసతి సౌకర్యాలు కల్పించి వారికి కార్పొరేట్ స్థాయి విద్య అందించడానికి మా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో నడపబడుతున్న పాఠశాలల్లో చక్కటి విద్యతో పాటు మెనూ ప్రకారం పౌష్టికరమైన ఆహారం అందిస్తున్నామని అన్నారు. గిరిజన పిల్లల విద్యాభ్యాసం బాలశిక్ష నుండే మెరుగుపడటానికి గ్రామస్తులు పిల్లల తల్లిదండ్రులు ఎంతో కృషి చేసి ఈ గ్రామంలో జిపిఎస్ పాఠశాల నిర్మాణానికి స్థల దాత కాకా ఈశ్వరి ఏ ఏ పీ సి చైర్మన్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నానని ఇలాగే ప్రతి గ్రామంలో విద్యకు దూరంగా ఉన్న గిరిజన పిల్లలను గుర్తించి వారిని తప్పనిసరిగా గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో చేర్పించడానికి యువతీ యువకులు పిల్లల తల్లిదండ్రులు ముందుకు వస్తే పిల్లలు బాగా చదువుకొని వారి బంగారు భవిష్యత్తును బాగు చేసుకుంటారని అన్నారు. గిరిజన విద్యార్థినీ విద్యార్థుల విద్యాభ్యాసం బలోపేతం చేయడానికి మా వంతు కృషిగా ఏ సాయం కావాలన్నా అందించడానికి ముందుంటామని అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఎమ్మెల్యే , పిఓ కలిసి నోటు పుస్తకాలు పెన్నులు పంపిణీ చేసిన అనంతరం పిల్లలతో కలిసి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డి ఈ హరీష్, ఎంపీడీవో ఏదయ్య ఎమ్మార్వో శ్రీనివాసరావు ఎంఈఓ రామయ్య పెద్ద మెడిసిలేరు పి జి హెచ్ ఎం సామ్రాజ్యం గ్రామస్తులు కాకా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలి....

- తేమతో సంబంధం లేకుండా పత్తికి గిట్టుబాటు ధర ఇవ్వాలి
- కేంద్ర ప్రభుత్వం విధానాలతో ఆందోళనలో పత్తి రైతులు
- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు




**భద్రాచలం టౌన్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):** సిసిఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేయాలని, తేమతో సంబంధం లేకుండా పత్తి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన భద్రాచలం పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ( సిసిఐ ) కఠిన నిబంధనలు కారణంగా రాష్ట్రంలో, జిల్లాలో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అకాల వర్షాలకు కోలుకోలేని దెబ్బతిన్న పత్తి రైతులకు సిసిఐ నిబంధనలు శాపంలా మారాయని అన్నారు. సిసిఐ నిబంధనలో భాగంగా కిసాన్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, స్లాబ్ బుకింగ్ తప్పనిసరి చేయటం, ఈసారి ఎకరాకు ఏడు క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సిసిఐ విధించిన నిబంధనలతో పత్తి రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆయన అన్నారు. పత్తి తేమ 8% ఉంటేనే గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటించడం సరైనది కాదని ఆయన విమర్శించారు. బయట దళారులు తక్కువ ధర ఇచ్చి కొనుగోలు చేయడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా పత్తిని సి.సి.ఐ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దిగుమతి సుంకాలను ఎత్తివేసి, రైతులపై ఆంక్షలు పెట్టి రైతాంగ వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని అన్నారు. తక్షణమే సిసిఐ నిబంధనలు సడలించి పత్తి కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకట రామారావు పాల్గొన్నారు...

## రోడ్ల మరమ్మత్తులను చేపట్టాలి



**ఇల్లందు, నవంబర్ 19, ప్రజాజ్యోతి:** మున్సిపల్ పరిధిలో గంతల మయంగా మారిన రోడ్లను త్వరితగతిన మరమ్మత్తులు చేయాలని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జబ్బార్ లు డిమాండ్ చేశారు. బుధవారం బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ప్రభుత్వం ప్రజల కోసమే ఉందని, జిల్లాలో డిఎంఎఫ్టి నిధులను ఉపయోగించి రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. రోడ్లు గుంతల మయంగా ఉండడం వలన ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాలకులకు రోడ్లపై ఉన్న గుంతలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్ రంగనాథ్, అబ్దుల్ నబీ, చీమల సత్యనారాయణ, కడకంచి పద్మ, నారపాక వసంతరావు, ఎర్రబెల్లి కృష్ణయ్య, లలిత్ పాసి, మధార్ బీ, కడకంచి వీరస్వామి, అరికపల్లి రవి గౌడ్, పాలడుగు రాజశేఖర్, బీబీ, బాబా, నూర్జహాన్, నరేష్, ఇమ్రాన్, బజారు సత్యనారాయణ, వంగా సునీల్, శ్రీకాంత్, కాసర్ల హరికృష్ణ, సర్దార్, రామ్ లాల్ పాసి, కిషన్ పాసి, ఖాజా, సతీష్, అజయ్, శ్రీను, చంటి, మునగంటి శివ, ముత్తయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి ఇందిరాగాంధీ

- ♦ రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్ , డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల



**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 19, ప్రజా జ్యోతి** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిత్యం పాటు పడిన మహోన్నత నాయకురాలు ఇందిరాగాంధీ అని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, DCMS మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు, భారత మాజీ ప్రధాని, భారతరత్న, ఉక్కు మహిళ, దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో కొత్వాల ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ఆటో యూనియన్ నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాల్వంచ దమ్మపేట సెంటర్ లోని ఇందిరాగాంధీ విగ్రహానికి కొత్వాల తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గరీబీ హటావో, బ్యాంకుల జాతీయం, రాజభరణాల రద్దు, 20 సూత్రాలు వంటి విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతి కోసం పాటుపడిన ఇందిరమ్మ చిరస్మరణీయురాలనిఅన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ZP చైర్మన్ బరిపటి వాసుదేవరావు, మాజీ ZPTC యర్రంశెట్టి ముత్తయ్య, ఐ ఎన్ టి యు సి నాయకులు SA జలీల్, కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, కాల్వ భాస్కర రావు, ఎస్ వి ఆర్ కె ఆచార్యులు, పైడిపల్లి మహేష్, చెన్నూరి రాము, కాపర్తి వెంకటాచారి, వై వెంకటేశ్వర్లు, దారా చిరంజీవి, గంగిరెడ్డి భువన సుందరరెడ్డి, డిష్ నాగేశ్వరరావు, బాలు నాయక్, మల్లిఖార్జున్, బాశెట్టి సాంబయ్య, ఎస్.కె గద్దర్ బాషా, కటుకూరి శేఖర్ బాబు, భూక్యా గిరి ప్రసాద్, జి.వి రత్నం, పరుపర్తి వెంకటేశ్వర్లు, అగ్నిమండలం భాస్కర్, మందా మురళి, రఫీ, అలవాల నాగేశ్వరరావు, దాసరి యాకయ్య, ఎన్ ప్రసాద్, సక్రు, జగదీష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలలో స్వేటర్స్ పంపిణీ



**కొత్తగూడెం, నవంబర్ 19(ప్రజాజ్యోతి):** నేల మీద ఉన్న వారిని ఆదుకోండి, సృష్టి కర్త అయిన దైవం మిమ్మల్ని ఆదుకుంటాడు, అనే ఉదేశంతో జమాతే ఇస్లామి హింద్, రుద్రంపూర్, రామవరం శాఖ ప్రతి సంవత్సరం చలికాలంలో వృద్దులకు దుప్పట్లు పంపిణీ నిర్వహిస్తారు. దానిలో భాగంగా ఈ సంవత్సరం కూడా చమన్ బస్తీలోని జ్యోతి వృద్ధాశ్రమం, బుడిద గడ్డలోని వృద్ధాశ్రమంలలోని వృద్దులకు జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో బుధవారం అధ్యక్షులు మాజిద్ రబ్బానీ స్వెట్టర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మానవ సేవ యే మాధవ సేవ" అని సమాజంలో ఉన్న పేదవారి అవసరాలు తీర్చే వారిని దైవం కరుణిస్తాడని అని అన్నారు. సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడే అని మానవులంతా ఆయన దాసులే అని, సహాయం చేసేటప్పుడు కుల, మతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ బాసిత్, అబ్దుల్ మన్నాన్, షమీం, పర్వీన్ సుల్తానా, అయేషా, ఇఖ్రా, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవ బస్సు జాత ముగింపు సభను జయప్రదం చేయండి

- 22 న భద్రాచలం లో ముగింపు
- వెయ్యి మందితో ర్యాలీ, బహిరంగ సభ
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా



**భద్రాచలం టౌన్, నవంబర్ 19(ప్రజాజ్యోతి):** సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జోడోఘాట్ లో ప్రారంభమైన బస్సు జాత ముగింపు సభ ఈ నెల 22 న భద్రాచలంలో ముగుస్తుందని, ఈ సభ విజయవంతానికి కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన జిల్లాలోని ఇల్లందు నియోజకవర్గంలోకి బస్సు జాత ప్రవేశిస్తుందని, ఇల్లందు పట్టణములో భారీ ర్యాలీ ప్రదర్శన అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. అక్కడ నుండి టేకులపల్లి మీదుగా పాల్వంచకి ప్రవేశించే బస్సు జాతకు ఘన స్వాగతం పలుకుతారని, పాల్వంచలో ర్యాలీ అనంతరం సభ నిర్వహించి అక్కడనుండి బూర్గంపాడు మండలంలోకి ప్రవేశించిన అనంతరం ఐటిసి పిఎస్పీడీ అతిథి గృహంలో బస చేస్తారని అన్నారు. 22వ తేదీ సారపాక నుంచి బస్సు జాత ప్రారంభమవుతుందని సారపాక సెంటర్లో వందలాదిమందితో ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు. గోదావరి బ్రిడ్జి మీదుగా భద్రాచలం చేరుకునే జాతకు పట్టణ ప్రవేశద్వారం వద్ద సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఆహ్వానిస్తారని చెప్పారు. అక్కడనుండి పట్టణమంతా కలియ తిరుగుతూ వంద లాది మోటార్ సైకిళ్లతో భద్రాచల పట్టణ పురవీధులలో భారీ ర్యాలీ జరుగుతుందని అనంతరం అంబేద్కర్ సెంటర్లోని విప్లవ వీరుల విగ్రహాల వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ బహిరంగ సభ విజయవంతానికి పార్టీ శ్రేణులు పాటుపడాలని తెలిపారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందంటూ అవాకులు చావాకులు పేలే వాళ్లనోళ్లు మూతపడే విధంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరగుతున్నయని, వందేళ్ళ పార్టీ చరిత్ర ఉద్యమాలు త్యాగాలను ఇంటింటికి చేరవేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. డిసెంబర్ 26న శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో కని విని ఎరుగని రీతిలో జరగబోతుందని, ఈ వేడుకకు 45 దేశాల నుండి ప్రతినిధులు తరలి వస్తున్నారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారతదేశ స్వతంత్రాన్నికంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ మరో 100 కూడా ప్రజల్లో మనగలదని చెప్పారు. ఎర్ర జెండాను అంతమొందించాలని ఎందరో కుటిలో ప్రయత్నాలు చేశారని అరచేతిని అడ్డుపెట్టి సూర్య కాంతిని, కుట్రలు కుతంత్రాలతో ఎర్ర జెండా రెపరెపలను ఎవరు అడ్డుకోలేరని అన్నారు. పేదల పక్షాన పోరాటాలు చేసేది ఎర్రజెండా లేనని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమే అని చెప్పారు. ప్రచార జతలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, కలవేన శంకర్, కలకోట కాంతయ్య, మణికంఠ రెడ్డి, పల్లె నర్సింహా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం కల్లూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పు శెట్టి రాహుల్, మువ్వ వెంకటేశ్వర రావు, జిల్లా సమితి సభ్యులు రామిరెడ్డి సబ్కా నాగేశ్వరరావు పేరాల శ్రీనివాస్ సాధనపల్లి సతీష్ నిమ్మల రాంబాబు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం మండలంలో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలి

- బిఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవోకి వినతిపత్రం సమర్పణ



**భద్రాచలం, నవంబర్ 19,(ప్రజాజ్యోతి):** భద్రాచలం మండలంలో ప్రధాన రహదారులపై నిత్యం వందలాదిగా వాహనాలు అలాగే ఇసుక లారీలు తిరగడం వల్ల రోడ్ల ధ్వంసం అవుతున్నాయని, పట్టణంలోని ఐటిడిఏ రోడ్డు నిత్యం వేలాది వాహనాలు కళాశాల పాఠశాల విద్యార్థులు వెళ్లే ప్రధాన రహదారి గుంటలమయంగా మరి ప్రజల ఇబ్బందులు పడుతున్నారని. ఐటీడీఏ రోడ్డు తక్షణం మరమ్మతులు చేయాలని భద్రాచలం మండల పరిధిలోని గ్రామపంచాయతీలో అంతర్గత రహదారులు డ్రైనేజీ వ్యవస్థను పరిష్కరించాలని మీద డిమాండ్ల పరిష్కారం కొరకు భద్రాచలం మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి బొగ్గ నారాయణ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కో కన్వీనర్ రేపాక పూర్ణ చంద్రరావు,సీనియర్ నాయకులు కొల్లం జయ ప్రేమ్ కుమార్,అయినాల రామకృష్ణ నరసింహులు, బాసిపోయిన మోహన్ రావు, కొలిపాక శివ తదితరులు ఉన్నారు.

## హిడ్మా మృతదేహాన్ని ఇవ్వండి

- హిడ్మా తల్లి భావోద్వేగ విజ్ఞప్తి



**చర్ల, నవంబర్ 19:(ప్రజా జ్యోతి ):**తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ బస్తర్‌లోని మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ కమాండర్ మాండ్వి హిడ్మా మరణం తరువాత, అతని గ్రామం పువర్తి వీధులు నిర్మానుష్యంగా మారాయి.కొడుకు మరణంతో బాధపడుతున్న అతని తల్లి పోలీసులకు భావోద్వేగ విజ్ఞప్తి చేస్తూ, "నేను వృద్ధురాలిని... నా కొడుకు మృతదేహాన్ని నేను తీసుకురాలేను. పోలీసులు నా కొడుకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకువస్తే తద్వారా నేను అంత్యక్రియలు నిర్వహించగలను" అని అన్నారు. ఛత్తీస్‌గఢ్ హోం మంత్రి విజయ్ శర్మ, బస్తర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సుందర్‌రాజ్ పి., సుక్మా పోలీసు సూపరింటెండెంట్ నవంబర్ 10న హిడ్మా గ్రామమైన పూర్వర్తిని సందర్శించారు. అక్కడ వారు హిడ్మా తల్లిని కలిసి లొంగిపోవాలని కోరారు. కానీ సరిగ్గా ఏడు రోజుల తర్వాత, నవంబర్ 18న, ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామ రాజు జిల్లాలో భద్రతా దళాలు నక్సలైట్ల మధ్య జరిగిన పెద్ద ఎన్‌కౌంటర్ గురించి వార్తలు వెలువడ్డాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, అతని భార్య రాజే మరో నలుగురు మావోయిస్టులు మరణించినట్లు నిర్ధారించబడింది. హిడ్మా మరణం తర్వాత అతని తల్లి రోదిస్తూ, కన్నీటితో, మౌనంగా ఉంది.

## వనమా రాఘవేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**పాల్వంచ(టౌన్),నవంబర్ 19(ప్రజా జ్యోతి):**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ పుట్టిన రోజు సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పాల్వంచలోని వారి నివాసాన్ని సందర్శించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రాఘవేందర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.తరువాత బిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు, వనమా రాఘవేందర్‌తో కలిసి సుమారు రెండు గంటలపాటు సమావేశమై పార్టీ కార్యక్రమాలు,భవిష్యత్ కార్యాచరణలపై చర్చించారు.తరువాత పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతూ రవిచంద్ర,పార్టీ బలోపేతం కోసం కట్టుబడి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు రూ.1.61 కోట్ల హుండీ ఆదాయం

- స్వామి వారిని దర్శించుకున్న జైళ్ల శాఖ డీజీ
- రామయ్యకు ప్రత్యేక అభిషేకం





**భద్రాచలం, నవంబర్ 19,(ప్రజాజ్యోతి** :భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం హుండీ లెక్కింపులో రూ.1,61,02,694 ఆదాయం లభించింది. ఆలయ ఆవరణలోని చిత్రకూట మండపంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో రూ1,61,02.694 నగదు, 141 గ్రాముల బంగారం, 850 గ్రాముల వెండి లభించింది. లెక్కింపు అనంతరం నగదును బ్యాంకు అధికారులకు అందజేశారు. కాగా హుండీ లెక్కింపు చివరగా సెప్టెంబరు 10న నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపు దేవస్థానం ఈవో దామోదర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించగా ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- స్వామి వారిని దర్శించుకున్న జైళ్లశాఖ డీజీ...

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ స్వాతి లక్రా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం దేవస్థానం తరపున వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్‌రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శ్రీ సీతారామచంద్రస్వామి వారికి బుధవారంను పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకం నిర్వహించగా అనంతరం స్వామి వారి నిత్యకల్యాణం నిర్వహించారు.

## రోడ్ల మరమ్మతులు వెంటనే చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

- దెబ్బతిన్న రహదారులపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర నిరసన - ఎంపీడీఓకు వినతిపత్రం





**దమ్మపేట, నవంబర్ 19:(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపు మేరకు, అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ,బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. మండల అధ్యక్షులు దొడ్డా రమేష్ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన వ్యక్తం చేసి, అనంతరం ఎంపీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు దొడ్డా రమేష్ మాట్లాడుతూమండలంలో ఎక్కడ చూసినా గుంతలు పడ్డ రహదారులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన పనులు 70% వరకు పూర్తయ్యినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఆ పనులను పట్టించుకోలేదని విమర్శించారు. వెంటనే రహదారి పనులు పూర్తి చేయడంతో పాటు గ్రామ పంచాయతీలలో పేరుకుపోయిన సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, మండల ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసుబాబు, మాజీ సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు, యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీనివాసరావు,నాయకపోడు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రావుల శ్రీనివాసరావు, మహేష్, మాజీ ఎంపిటీసీ కానిని శ్రీను, బీసీ సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వరరావు, మండల నాయకులు సోదెం గంగరాజు, కుకలకుంట రవి, అబ్దుల్ జిన్న, కోర్స వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ నాయకులు మద్దెల పుల్లారావు, తోలేం మల్లేశ్వరరావు, వల్లెపు నాగేశ్వరరావు, కేసిన మధు, వాడపల్లి ఆనంద్రావు, మిడత లక్ష్మీనారాయణ, గణేష్, నూతి అజయ్, మడిపల్లి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పలు కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, నవంబర్ 19 (ప్రజా జ్యోతి ):** అశ్వారావుపేట శాసన సభ్యులు శ్రీ జారే ఆదినారాయణ బుధవారం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. దమ్మపేట మండలం గట్టుగూడెం గ్రామంలో కోటగిరి సత్యం బాబు సోదరుడు కోటగిరి నరసింహారావు అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి వారి దుఃఖంలో భాగస్వాములు అయ్యారు.ఈ సందర్భంగా నరసింహారావు నేత్రాలను నేత్రనిధికి దానం చేసిన కుటుంబ సభ్యుల సేవాభావాన్ని ఎమ్మెల్యే విశేషంగా అభినందించారు. మరణానంతరం కూడా ఇంకొకరి జీవితానికి వెలుగునిస్తూనే ఉండే ఈ మహత్తర నిర్ణయం సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు.తరువాత ఏన్కూరు మండలం నాచారం గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే, వ్యాయామ ఉపాధ్యాయులు బొల్లి గోపాలరావు మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా నిర్వహించిన దశదిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకుని, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. విషాదాన్ని తట్టుకుని ముందుకు సాగాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి 69వ అండర్–14, 17, 19 రైఫిల్ షూటింగ్ స్టేట్ మీట్ పోటీలకు హాజరైన ఎమ్మెల్యే జారే, పోటీలు సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించారు. సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఆయన, క్రీడల ప్రాధాన్యతను వివరించారు. రైఫిల్ షూటింగ్ వంటి క్రీడలు క్రమశిక్షణ, ఏకాగ్రత, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర,జాతీయ స్థాయిలో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, పోటీలలో పాల్గొన్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గుంతలు పడ్డ రోడ్లు బాగు చేయండి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన
- కొత్తగూడెం కార్పొరేషన్లో సమస్యలు పరిష్కరించాలని వినతి
- గుంతలమయమైన రోడ్లను బాగు చేసి,కార్పొరేషన్లో సమస్యలు పరిష్కరించాలి: సీతాలక్ష్మి



**కొత్తగూడెం,నవంబర్ 19 (ప్రజాజ్యోతి):**గత మూడు నెలల కాలం నుంచి భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా గుంతలమయమైన రోడ్లను బాగు చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టడం జరిగిందని కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి రామవరం గోధుమ వాగు బ్రిడ్జి మీద నిరసన తెలిపారు. పాడైన రోడ్లు బాగు చేయాలని నినాదాలు చేశారు.అనంతరం కొత్తగూడెం కార్పొరేషన్ మేనేజర్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతాలక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు స్థానిక ఎన్నికల పార్టీ ఇంచార్జి వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు సూచనల మేరకు నిరసన కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రోడ్లు బాగు చేయాలని అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా అధికారుల తీరులో మార్పు రావడం లేదని మండిపడ్డారు. కొత్తగూడెం వ్యాప్తంగా ఎక్కడ గుంతలకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవన్నారు. తక్షణమే కొత్తగూడెం కార్పొరేషన్ వ్యాప్తంగా గుంతలు పడ్డ రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న పనులను పూర్తి చేయాలని, రామవరంలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలో కోతులు, కుక్కల బెడద తగ్గించాలని, రామవరం వనమా పార్కు నేమ్ బోర్డును సరి చేయాలని, పర్యవేక్షణ లోపం కారణంగా మరుగున పడ్డ మరుగుదొడ్లకు మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ వ్యాప్తంగా పాడయిన చోట స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం తవ్విన సీసీ రోడ్లను తిరిగి నిర్మించి పంపు కనెక్షన్లు ఇవ్వాలన్నారు. మూలనపడ్డ పారిశుద్ధ్య ట్రాలీలకు మరమ్మతులు చేసి వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ కార్మికులకు ఇవ్వాల్సిన సామాగ్రిని అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, మాజీ కౌన్సిలర్లు ప్రసాద్, అంబుల వేణు, తోగరు రాజశేఖర్, తాండ్ర శీను, పల్లపురాజు దూడల కిరణ్, హుస్సేన్, పిల్లి కుమార్, రామిళ్ళ మధు, మునీర్, తమ్మిశెట్టి అశోక్, మద్దెల సుధీర్, వెంకటరమణ, రిజ్వాన్, అజ్మీర విజయ్, బుద్ధి మధుసూదన్ రావు, పేరం సందేశ్, వంటేరు కళ్యాణ్, పూర్ణచందర్ నాయక్, మనోజ్, సిద్దు, అనీష్, హైమద్, అజ్జు, రిజ్జు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల కష్టాన్ని దోపిడీ చేయొద్దు...

- పత్తిని షరతులు లేకుండా కొనాలి- బద్రు నాయక్.



**పాల్వంచ(టౌన్), నవంబర్ 19 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో పత్తి రైతులను రక్షించే దిశగా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు గూగులోత్ బద్రు నాయక్ డిమాండ్ చేశారు. వర్షాల విపత్తులతో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్న రైతులను ఇలాంటి సమయంలో మరింతగా కష్టాల్లోకి నెట్టడం సరికాదని ఆయన తీవ్రంగా విమర్శించారు. బద్రు నాయక్ మాట్లాడుతూ "రైతులు వర్షాలు,ప్రకృతి విపత్తులను తట్టుకొని పత్తి పండిస్తే కొనుగోలు సమయంలో తేమశాతాన్ని కారణంగా చూపుతూ ధర తగ్గించడం దారుణం. ప్రభుత్వం నిర్ణయించిన ఎంఎస్పీ కంటే తక్కువకు సీసీఐ కొనుగోలు చేయడం రైతులపై దాడి చేసినట్టే" అన్నారు. గతంలో ఎకరాకు 12 క్వింటాల వరకు పత్తిని సీసీఐ కొనుగోలు చేసినప్పటికీ, ఇప్పుడు ఎకరాకు కేవలం 7 క్వింటాలు మాత్రమే కొనుగోలు చేసేలా షరతులు పెట్టడం రైతులకు పెద్ద దెబ్బ అని ఆయన పేర్కొన్నారు. అంతేకాక, పట్టాదారు పాసు బుక్ ఉన్నవారికి మాత్రమే కొనుగోలు చేయడం సరికాదని, "మ్యానువల్ అడంగల్,పహాణి నకళ్లను కూడా చెల్లుబాటు పత్రాలుగా గుర్తించి కొనుగోలు చేయాలి" అని బద్రు నాయక్ తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న తేమశాతం 8% నుండి 12% నిబంధనలను రద్దు చేసి,రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 20%–22% తేమశాతం ఉన్న పత్తినీ కొనుగోలు చేయాలని సీసీఐకు ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు న్యాయం చేయాలని, షరతులు విధించకుండా ప్రభుత్వం వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని బద్రు నాయక్ డిమాండ్ చేశారు.

## ఇంతటి దౌర్జన్యమా..?

- నిరుపేదల ఇళ్ళు కూలుస్తారా..?
- బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటా... తాటి వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు



**అశ్వారావుపేట, నవంబర్ 19, ప్రజాజ్యోతి :** ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్నారన్న నెపంతో అర్ధరాత్రి పేదల ఇల్లు కూల్చి దౌర్జన్యం చేస్తారా అంటూ అశ్వారావుపేట మాజీ శాసనసభ్యులు మాజీ ట్రైకార్ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు మండిపడ్డారు. మున్సిపాలిటీ పరిధిలోని 1228 సర్వే నెంబర్ లో సుమారు 250 కుటుంబాలు గత నాలుగేళ్లుగా నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తున్నారు. ఇల్లు నిర్మించుకున్నారని ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవిన్యూ, పోలీస్ అధికారులు వారి ఇళ్ళను తొలగించారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చకి దారి తీయడంతో బుధవారం తాటి వెంకటేశ్వర్లు అధికారులు తొలగించే ఇళ్లను పరిశీలించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రోజువారి కూలికి వెళ్లే పేదలు ఇల్లు నిర్మించుకునేటప్పుడు అధికారులు మౌనంగా ఉండి వారు అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్న తర్వాత ఇలా దౌర్జన్యంగా ఇళ్లను కూల్చడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వానికి ఆ స్థలం అవసరమైనప్పుడు వారితో చర్చించి ప్రత్యామ్నాయంగా వారికి వేరే స్థలం చూపించి ఇల్లు ఖాళీ చేయాల్సిన ప్రజా ప్రతినిధులు నిర్దయగా వ్యవహరించారన్నారు. తాము ఓట్లు వేసి గెలిపించుకున్న ప్రభుత్వం ఇళ్ల పట్టాలిస్తుందని ఎంతో నమ్మకంతో ఉన్న వారి ఆశలను వమ్ము చేస్తూ నిలువ నీడ లేకుండా చేశారన్నారు. ఎన్నికల సమయంలో మీకు పట్టాలిస్తాం, ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని మాటలు చెప్పిన ప్రజా ప్రతినిధులు మొహం చాటేసారన్నారు. భూస్వాముల చేతుల్లో ఉన్న వందల ఎకరాలను వదిలేసి పేద ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను కూల్చేయటం దారుణమన్నారు. ఎంత గొప్ప ప్రభుత్వాలైనా ప్రజాగ్రహానికి పతనం గాక తప్పదని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి నష్టపోయిన పేద ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో బాధితుల తరపున వారికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అంకత మల్లికార్జునరావు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## పట్టపగలు దొంగతనాలు... అడ్డుకున్నందుకు గాయాలు

- కోళ్ళు, ఇత్తడి వస్తువులు ఇనుప వస్తువులు చోరీ..
- అడ్డగించిన యజమానీకీ గాయాలు.



**జూలూరుపాడు నవంబర్ 19 (ప్రజా జ్యోతి )** సూపర్ మండల పరిధిలోని పడమటి నరసాపురంలో పిల్లలను పట్టుకుంటున్నామని వచ్చి ఇతడి వస్తువులు సంబంధించిన వస్తువులు ఎత్తుకు వెళు తొండగా అడ్డగించగా ఓ వ్యక్తికి గాయాలైన ఘటన చోటుచేసుకుంది. రెండు టీవీఎస్ మోటార్ సైకిళ్లు పై కిల్లులను పట్టుకుంటున్నామని ముగ్గురు వ్యక్తులు నరసాపురం కు చెందిన వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చారు. అయితే అతను ఇంట్లోకి రావద్దని గతంలో మాకు చెందిన మూడు కోళ్లు పోయినాయని రావద్దని చెప్పగా మేము పిల్లులను పట్టుకోవడానికి వచ్చామని మా దగ్గర ఒక పిల్లి కూడా ఉందని చూపెట్టారు. నమ్మిన ఆ ఇంటి యజమాని తన ఇంట్లో పని చేసుకుంటుండగా తన ఇంటి బయట ఉన్న ఇత్తడి గంగాళం ఎత్తుకుపోయిన విషయాన్ని వారు వెళ్లిపోయిన తర్వాత యజమాని గుర్తించాడు. ఈ క్రమంలో ఆవేదంలోనే ఉన్న లేళ్ళ అనిల్ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లి తన ఇంటి వెనకాల ఉన్న ట్రాక్టర్ కు సంబంధించిన ఇనుప వస్తువులు సుమారు పదివేల విలువ చేసేవి ఎత్తుకు వెళ్లారని, గుర్తించి ముగ్గురు వ్యక్తులపై ఆరా తీస్తుండగా అప్పటికే ఇద్దరు వ్యక్తులు మోటార్ సైకిల్ పై ఇనుప సామాన్లు తరలించారు,ఓ వ్యక్తి దొరకగా అతనిని అడ్డగించిగా,వెంకటేశ్వర్లును పక్కకు నెట్టు వేయగా వెంకటేశ్వర్లు తలకు మోకాలకు గాయాలయ్యాయి తన వద్ద ఉన్న ఇనుప చిలుకులను చూసి జనాలు భయపడ్డారు ఒక ఇత్తడి గంగాళాన్నీ అక్కడే వదిలేసి వెళ్లాడు పిల్లులను పట్టుకుంటున్నామని చెప్పుకునే ముగ్గురు వ్యక్తులు కు సంబంధించిన ఇనుప చినుకులు. సంచిలో కొన్ని వలలు ఓ పిల్లిని సైతం వదిలేసి వెళ్లిపోయారు. వెంబడించిన వ్యక్తి దొరకలేదు పోలీసులకు చెప్పగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని జరిగిన విషయంపై ఆరా తీశారు. పిల్లలను పట్టుకుంటున్నామని ముసుగులో ఇంట్లో ఉన్న వస్తువులను . కోళ్లను, ఇనుప సామాన్లుదొంగలించేందుకు వస్తున్నారు అడ్డు వస్తే వారి వద్ద ఉండే ఆయుధాలతో దాడికి కూడా వెనకాడడం లేదు. ఈ విషయంలో ఇంటి వద్ద ఉన్న వ్యక్తులు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు.

## పోలీసుల సహకారంతో సొంత ఖర్చులతో రహదారి నిర్మాణం

**ఆళ్ళపల్లి. నవంబర్19, ప్రజాజ్యోతి** ఆళ్ళపల్లి మండల పరిధిలో గల వెంకటాపురం గ్రామంలోని రోడ్డు సమస్యను వెంకటాపురం గ్రామస్థులు స్వయంగాపరిష్కరించుకున్నారు. దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోని ప్రధాన రహదారిని, గ్రామస్థులందరూ ఏకమై, సొంత ఖర్చులతో మరియు శ్రమదానంతో నిర్మించుకోవడం ద్వారా ఈ ప్రాంతంలో ఆదర్శంగా నిలిచారు. వెంకటాపురం గ్రామం ప్రాంతాలకు ప్రధాన రవాణా మార్గంగా ఉన్న ఈ రహదారి గత కొన్నేళ్లుగా పూర్తిగా శిథిలమైపోయింది. గుంతలు, మట్టి కారణంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై అధికారులకు విన్నవించినా తగిన స్పందన రాకపోవడంతో, గ్రామస్థులు కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలోని పెద్దలు, యువత, మహిళలు అందరూ సమావేశమై రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులను చందాల రూపంలో పోగు చేశారు. కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, గ్రామస్థులు స్వచ్ఛందంగా శ్రమదానంలో పాల్గొన్నారు. ట్రాక్టర్లు, ఇతర సామగ్రిని సమకూర్చుకుని, యుద్ధప్రాతిపదికన రోడ్డు పనులను చేపట్టారు. ఈ సామూహిక కృషికి స్థానిక పోలీసు శాఖ నుండి కూడా అమూల్యమైన సహకారం లభించింది. రోడ్డు పనులకు భద్రత కల్పించడంలోనూ, పనులు సజావుగా సాగడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడంలోనూ పోలీసులు చొరవ చూపారు. గ్రామస్థులు మరియు పోలీసుల సమన్వయంతో, అతి తక్కువ సమయంలోనే రహదారి నిర్మాణం పూర్తయింది. ఈ కొత్త రోడ్డు నిర్మాణం వల్ల ఇప్పుడు వెంకటాపురం ప్రజలకు ప్రయాణం సులభతరం అయిందిఎప్పటికైనా ప్రభుత్వం మా గ్రామానికి పటిష్ట మైన రహదారి నిర్మించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.



## అటవీ సంపదను రక్షించుకోవాలి. డి.ఎఫ్ .ఓ ,కిష్టా గౌడ్.

- జూలూరుపాడు అటవీ రేంజ్ లు సందర్శన.



**జూలూరుపాడు నవంబర్ 19ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ అధికారి కిష్ట గౌడ్ బుధవారం జూలూరుపాడు అటవీ రేంజ్ లో ఉన్న ప్లాంటేషన్లను సందర్శించారు. రాజారావుపేట అటవీ ప్రాంతంలో గత సంవత్సరం ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ను వినోభా నగర్లో గత రెండు సంవత్సరాల క్రితమే ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ను పరిశీలించారు అనంతరం రాజారావు పేట అటవీ ప్రాంతంలో నేషనల్ ఫారెస్ట్ ను పరిశీలించి అభివృద్ధిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు ప్లాంటేషన్ లో ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎఫ్ఆర్ఓ ప్రసాదరావును ఆదేశించారు. ఆటవి సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత అటవీ ఉద్యోగులపై ఉందని అందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్టిఓ కోటేశ్వరరావు సిబ్బంది మల్లయ్య రేఖ,రహీం,కిషన్,వెంకటేశ్వర్లు శ్రావణులు ఉన్నారు.

## జగన్నాధపురం పాఠశాలలో ఆకస్మిక తనిఖీ-విద్యా ప్రమాణాలపై దృష్టి.

- విద్యార్థుల హాజరు పెంపుపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.
- పాఠశాలలో పరిశుభ్రత,మొక్కల పెంపుపై ప్రత్యేక సూచనలు.
- మిడ్డే మీల్ నాణ్యతను పరిశీలించిన(డి ఇ ఓ)-నాగలక్ష్మి





**పాల్వంచ(టౌన్),నవంబర్ 19(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,పాల్వంచ మండల పరిధిలోన్ని జగన్నాధపురం విద్యార్థుల హాజరు శాతాన్ని 100% చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి (డి ఇ ఓ) & జడ్పీ సీఈవో నాగలక్ష్మి సూచించారు.బుధువారం నాడు ఆమె జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పలు అంశాలను పరిశీలించారు. పరిశీలనలో భాగంగా పాఠశాల మరుగుదొడ్లు,శుభ్రత,చుట్టుపక్కల వాతావరణాన్ని సమీక్షించిన ఆమె “పాఠశాల పరిశుద్ధంగా, ఆహ్లాదకరంగా ఉండేలా మొక్కలు నాటాలి.విద్యార్థుల హాజరులో ఎలాంటి లోపాలు ఉండకూడదు” అని సూచించారు.ఇక మధ్యాహ్న భోజనంపై కూడా ఆమె ప్రత్యేక దృష్టి సారించారు.మెనూ ప్రకారం వంట చేస్తున్నారో లేదో,విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదో క్షుణ్ణంగా పరిశీలించారు.తరువాత పెద్దమ్మగుడి వద్ద నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ పనులను పరిశీలించిన నాగలక్ష్మి గారు,డ్రెయిన్ చివర ఉన్న ఇంకుడు గుంతల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఏఈ శ్రీనివాస్ గారికి ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి,ఎంఈఓ శ్రీరామ్మూర్తి, ఏపీవో పోరండ్ల రంగా, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.లత, వెంకటేశ్వరరావు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్తికి మద్దతు ధర 10వేలు గా ప్రకటించాలి

- రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర
- అసలే రైతులు అకాల వర్షంతో నష్టపోయారు.
- షరతులు లేకుండా ప్రత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్.



**జూలూరుపాడు నవంబర్ 19 ప్రజా జ్యోతి.** పత్తి తేమ శాతం కారణంగా కొనుగోలు నిలిపి వేయాలన్న పిలుపులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డుల వద్ద నిరసన కార్యక్రమాలు జరిపాయి అందులో భాగంగానే ఖమ్మం రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బుధవారం జూలూరుపాడు లోని పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. పత్తి రైతులతో పాటు కొనుగోలుదారులతో మాట్లాడారు అయితే పత్తి కొనుగోలు 5500 నుండి 6600 మాత్రమే ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు అధిక వర్షాల కారణంగా రైతుల పత్తి చేలన్నీ వర్షాలతో నష్టపోవడమే కాకుండా పత్తి కూడా తడిసిపోయాయని ఈ క్రమంలో తేమ శాతాన్ని సాకుగా చూపించి తక్కువ రేటు కొనుగోలు చేయడం దారుణమని అన్నారు మార్కెట్ యార్డ్ వద్ద మార్కెట్ అధికారులు లేకపోవడం జెండా పాట పెట్టకపోవడం ఎవరు ఇష్టం వచ్చినట్లు వారు కొనుగోలు చేస్తున్నారని ఈ కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు రాష్ట్రవ్యాప్త గా బీఆర్ఎస్ నిరసనలు తెలియజేయడంతో వ్యవసాయ శాఖ మంత్రి చొరవ తీసుకొని కొనుగోలను యధాతథంగా జరిగేలా ప్రయత్నం చేశారని అది టిఆర్ఎస్ పార్టీ విజయంగా భావిస్తున్నామని అన్నారు. కిసాన్ యాప్ అంటూ రైతులను ఇబ్బందులు పెట్టడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు నేరుగా సిసిఐ ద్వారా రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలు కూడా ఎవరు పట్టించుకోవడంలేదని విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు అయితే ప్రతి మద్దతు ధరకు టిఆర్ఎస్ ఎంపీలు కేంద్రంతో మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని అందుకు కాంగ్రెస్ పార్టీ కలిసి వస్తే తప్పకుండా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లకావత్ గిరిబాబు, ఎల్లంకి సత్యనారాయణ,చాపలమడుగు రామ్మూర్తి, నాగభూషణం, నవీన్ చౌదరి, రామారావు,తిరుపతి పాల్గొన్నారు.

## గుంతల మయమైన రహదారులు

- మరమ్మత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడండి...
జుజ్జురి వెంకన్నబాబు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు



**అశ్వారావుపేట, నవంబర్ 19,ప్రజాజ్యోతి :** నియోజకవర్గ కేంద్రంతోపాటు, మండల వ్యాప్తంగా రహదారులు గుంతల మయమైపోయాయని మరమ్మత్తులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలంటూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జుజ్జూరి వెంకన్న బాబు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు నియోజకవర్గం ఇంచార్జ్ మచ్చ నాగేశ్వరావు ఆదేశాలతో "గుంతలు పుడ్చండి -ప్రజల ప్రాణాలను కాపాడండి" అనే నినాదంతో మండల వ్యాప్తంగా రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివేకానంద కూడలి నుండి ఎంపీడీవో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మాలోతు కుమారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకన్న బాబు మాట్లాడుతూ మండలంలోని అనేక ప్రధాన రహదారులు గుంతల మయంగా మారి, ప్రమాదాలకు నిలయంగా మారాయని నిత్యం ఏదో ఒకచోట ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారన్నారు. తక్షణమే అధికారులు ప్రభుత్వ ప్రతినిధులు స్పందించి గుంతలను పోల్చాలని లేనిపక్షంలో ఆందోళన ఉదృతం చేస్తామన్నారు.

- **పేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమే**

మున్సిపాలిటీ పరిధిలోని 1228 సర్వే నెంబర్లు ప్రభుత్వ భూమి అని పేదలు ఇల్లు నిర్మించుకుంటే అర్ధరాత్రి వాటిని కూల్చి వారిని రోడ్డుపాలు చేయడం దుర్మార్గమని వెంకన్న బాబు మండిపడ్డారు. పేద ప్రజలకు అండగా ఉంటాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఇది సరైన పాలన కాదన్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఇల్లు కోల్పోయిన పేదలకు ప్రత్యామ్నయం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి, జల్లిపల్లి శ్రీ రామ మూర్తి, పట్టణ అధ్యక్షులు సత్యవరపు సంపూర్ణ సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు నారం రాజశేఖర్, రఘురామ్, తాళం సూరిబాబు, జోగారావు, ఎస్ వీర్రాజు, కాశి కాళహస్త్రి, వెంకటస్వామి, నక్క రాంబాబు పాల్గొన్నారు.

## గెలుపోటములను క్రీడాస్ఫూర్తి తో సమానముగా స్వీకరించాలి

**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 19 – ప్రజాజ్యోతి:** కార్పోరేట్ ఏరియా సిఈఆర్ క్లబ్ నందు వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో గత 2 రోజులగా జరుగుతున్న కంపనీ స్థాయి బాస్కెట్ బాల్ మరియు టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధి గా జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ ఆర్ జి.వి.కిరణ్ కుమార్ గారు పాల్గొని విజేతలైన క్రీడాకారులను మరియు టీమ్ మేనేజ్మెంట్లను అభినందించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి జి ఎం(పర్సనల్) వెల్ఫేర్ & సి ఎస్ ఆర్ జి.వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తి తో సమానముగా స్వీకరించాలని, ఓటమి చెందిన టీమ్ లు మరింత పట్టుదలతో కృషి చేసి రాబోయే టోర్నమెంట్లలో విజేతలుగా నిలవాలని కోరారు. సింగరేణి సంస్థ కార్మికుల సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రీడలకు పెద్దపీట వేస్తున్నది అని క్రీడాకారులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. ఈ బాస్కెట్ బాల్ మరియు టెన్నిస్ పోటీల మానసికముగా మరియు శారీరకముగా ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన టెన్నిస్ విజేతలు కోల్ ఇండియా స్థాయి లో నిర్వహించే పోటీలలో పాల్గొని మరిన్ని పథకాలను సాధించాలని అన్నారు. టెన్నిస్ పోటీలలో మెన్స్ సింగిల్స్ లో శశిధర్ రెడ్డి, ఆర్ జి–1 ఏరియా మొదటి, బి.సంజీవ్, ఆర్ జి–2 ఏరియా ద్వితీయ స్థానంలో, మెన్స్ డబుల్స్ లో బి.రవి & బి.సంజీవ్, ఆర్ జి–1 మొదటి, హెచ్.రమేష్& శశిధర్ రెడ్డి, ఆర్ జి–1& ఆర్ జి–2 ద్వితీయ స్థానం లో అదే విధముగా వెటరన్ సింగిల్స్ లో జె.శ్రీమన్నారాయణ, మణుగూరు& ఇల్లందు మొదటి, జి.మురళీకృష్ణ, బెల్లంపల్లి ద్వితీయ స్థానం లో మరియు వెటరన్ డబుల్స్ లో ఏ.వెంకటేశ్వర్లు & ఎస్.రమేష్ ఆర్ జి–1 & ఆర్ జి–2 మొదటి , జే.రాం బాబు & బాబర్ పాషా, కేజిఎం & కార్పొరేట్ లు ద్వితీయ స్థానం లో నిలిచారు. బాస్కెట్ బాల్ పోటీలలో మణుగూరు & ఇల్లందు ఏరియా మొదటి స్థానం లో మరియు ఆర్ జి–3 & భూపాలపల్లి ద్వితీయ స్థానం లో నిలిచారు. ఈ పోటీలలో విజయం సాదించిన టెన్నిస్ క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయి లో జరిగే టెన్నిస్ పోటీలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ శ్రీ బి.శివ కేశవ రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమం లో గుర్తింపు సంఘం(ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ శ్రీ ఎస్.వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్ టియూసి) ఎస్.పీతాంబర రావు, సిఎంఓఏ ఐ వైస్ ప్రెసిడెంట్ ఆర్. కేశవ రావు, డి వై.పి ఎం & హనరరీ సెక్రటరీ ఎస్.సునీల్ కుమార్, స్పోర్ట్స్ సూపర్వై జర్ ఎం సి. పోస్ నెట్, కార్పొరేట్ ఏరియా స్పోర్ట్స్ కొ ఆర్డినేటర్ పి.నితిన్ కుమార్ , 11 ఏరియా ల నుండి వచ్చిన స్పోర్ట్స్ సూపర్వైజర్లు , క్రీడాకారులు పాల్గొన్నారు.



# ఫుట్ పాత్ ల పై ఇష్టానురాజ్యంగా దుకాణాలు

- **నిద్ర వలయం లో అధికారులు!**
- **గ్రామపంచాయతీలో అధికారులు ఉన్నట్టా లేనట్టా ?**



**అశ్వాపురం, నవంబర్ 19, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం అశ్వాపురం మండలము దినదిన అభివృద్ధి చెందుతున్న మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం వస్తూ ఉంటారు. వాహనాలు రద్దీ పెరగడం తో ప్రధాన రహదారి పై ప్రజలు నడవడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు ఇది ఇలా ఉంటే వ్యాపారాల కోసం ఫుట్ పాత్ ను ఆక్రమించి చిరు వ్యాపారులు మొదలుకొని పెద్ద వ్యాపారస్తులు కూడా ఫుట్ పాత్ పై వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరైతే ఏకంగా రోడ్లపై తోపుడుబండ్లతో వ్యాపారం చేస్తున్నారు. అంతేకాకుండా రోడ్లపైనే వాహనాల నిలపడం షాపుల ముందే వాహనాలను నిలపడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. ముఖ్యంగా వాణిజ్య అవసరాలకు ఆసుపత్రికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద పెద్ద భవనాలు ఉండి పార్కింగ్ కు స్థలము లేక వాహనాలను రోడ్ల పైన పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడం వల్ల మణుగూరు బి టి పి ఎస్ కు పెద్ద పెద్ద వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. దీనికి తోడు ఇసుక టిప్పర్లు, బొగ్గు టిప్పర్లు అత్యంత వేగంతో తిరగడం వల్ల ప్రధాన రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతూ ఉంటాయి. ప్రధానంగా రోడ్ల విస్తరణ పెంచడంతో ఒకవైపు రోడ్లు ను తవ్వి వదిలేయడంతో రద్దీ పెరిగి ప్రమాదాలకుదారి తీస్తున్నాయి. ఫుట్ పాత్ ఆక్రమించి నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరైతే ఏకంగా ప్రధాన రహదారిని ఆక్రమించి పండ్ల వ్యాపారాలు పెట్టి అడ్డు అదుపు లేకుండా సాగిస్తున్నారు. అంతే కాక సాయంత్రం 5 అయితే రోడ్డు పై తోపుడు బండ్ల తో టిఫిన్ సెంటర్, గప్ చుప్ బండ్లు వెలుస్తున్నాయి.

- **మండలాలలో ట్రాఫిక్ రూల్స్ అస్తవ్యస్తం**

మండలాల్లో పోలీసులు చక్కని పనితీరును కనబరుస్తున్నారు. చేతిలో ట్యాబ పట్టుకుని ఫోటోలు తీస్తూ ఫైన్లు వేస్తున్నారు. రాంగ్ రూట్లో వాహనాలు నడిపిన,త్రిబుల్ రైడ్ చేసిన, ఫోటోలు కొట్టి ఫైన్లతో వాతలు పెడుతూ ప్రజలలో భయాన్ని ఉంచుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ యొక్క సమస్యకు మార్గం చూపించగలరని కోరుతున్నా మండల ప్రజలు

## గుంతల రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలి

- **చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ**



**చర్ల, నవంబర్ 19: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ రేగా కాంతారావు డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మానెం రామకృష్ణ పిలుపు మేరకు చర్ల మండలం లోని గుంతలు పడ్డ రోడ్లు సమస్యల పై చర్ల ఎంపీడీవో ఆఫీస్ లో చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు కోకన్వీనర్ అయినవోలు పవన్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీగా వెళ్లి ఎంపీడీవో ఈదయ్యకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ విషయంపై ఈదయ్య స్పందించి కలెక్టర్ కి ఐటిడిఏ పిఓకి తెలియజేస్తాను అని హామీ ఇచ్చారు .ఈ సందర్భంగా దొడ్డి తాతరావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని మండలాలో ఇసుక లారీల వలన ప్రభుత్వం రెండు సంవత్సరాల నుండి రోడ్లును పట్టించుకోకపోవడం వలన రోడ్లు అన్ని గోతులు గుంటలతో నిండి పోయినవి గోతులు తప్ప రోడ్డులు కనిపించడం లేదు ఇంటి నుండి బండిపై బయటకు వెళ్లిన మనిషి ఇంటికి తిరిగి వచ్చే వరకు బయపడుతున్నారు అనేక మంది యువకులు చనిపోయారు అని ఇసుక లారీల వలన రోడ్లు పాడైంది అని దుమ్ము దూళి తో దగ్గు ఊపిరి తిత్తులు పాడైపోతున్నాయి అని ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నరు అని అన్నారు . చర్ల మండలంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు అని వెంటనే రోడ్డు వేసి ప్రజలకు న్యాయం చేయాలని లేని ఎడల ప్రజల పక్షాన ఉద్యమాలు చేస్తున్నే ఉంటామని తెలియజేసారు ఈ కార్యక్రమం లో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ గొర్ల రాజబాబు జోగిరాజు దినసరపు భాస్కర్ రెడ్డి పంజా రాజు కాకి అనిల్ తూర్రం రవి కుమార్ గోరింట్ల వెంకటేశ్వరరావు అంబోజి సతీష్ చందామల్ల వాణి కారం కన్నారావు కట్టం కన్నారావు సంతపూరి సతీష్ కనుకు వీరభద్రం వంకాయల కృష్ణ పవన్ సాంబశివరావు చెన్నుమల్ల వంశి ఎడ్ల రాందాసు కుక్కడప్పు సాయి కనితి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓంకార నాదంతో మారుమోగిన శ్రీ ఉమా గణపతి శివాలయం

- **ఇల్లందు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మహా దీపోత్సవం**
- **సందర్శించిన వాసవి క్లబ్ రీజియన్ ఛైర్ పర్సన్**
- **అధిక సంఖ్య లో పాల్గొన్న భక్తులు**








**ఇల్లందు, నవంబర్ 19, ప్రజాజ్యోతి:** కార్తీక మాసం మాస శివరాత్రిని పురస్కరించుకొని బుధవారం శ్రీ ఉమా గణపతి శివాలయం దీపాల వెలుగులు, భక్తుల సందోహంతో మారిపోయింది.ఆకాశదీపం వెలిగించడంతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు, పంచామృత అభిషేకం, అనంతరం పూలాభిషేకం, పంచహారతుల నడుమ స్వామివారు మహిమాన్వితంగా వెలుగొందడం భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వస్తిక్, ఓంకారం, శివలింగం ఆకృతుల్లో వెలిగించిన దీపాలు, అలాగే భక్తులు స్వయంగా వెలిగించిన శివలింగం, ఓం నమశ్శివాయ దీపరూపాలు చూడడానికి రెండు కళ్లూ సరిపోనీ విధంగా భక్తి వాతావరణాన్ని సృష్టించాయి.

- **ప్రత్యేక లక్కీడిప్ – స్వామివారి పూజలోని పట్టు వస్త్రాలు**

వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్ అలేఖ్య దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భక్తులకు ప్రత్యేకంగా లక్కీడిప్ ఏర్పాటు చేశారు. విజేతలైన నాళ్ల భాను దంపతులకు స్వామివారి పూజలో అర్పించిన పవిత్రమైన పట్టు వస్త్రాలు పట్టు చీరను బహుమతిగా అందించడం జరిగింది. అదేవిదంగా వాసవి క్లబ్ ఇల్లందు ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్ అలేఖ్య, ప్రముఖ వ్యాపారవేత్త యెలుగూరి వినోద్ బాబు హేమ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఆలయంలో భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వాసవి క్లబ్ 106 రీజియన్ ఛైర్ పర్సన్ సీమకుర్తి రాజ మనోహర్, వారి సోదరుడు తరుణ్ హాజరై శివాలయ కార్యక్రమాలకు శోభాయమానులను చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు బోనగిరి రవికిరణ్, ప్రధాన కార్యదర్శి కటకం సత్యేంద్ర కుమార్, కోశాధికారి తీర్దాల నాగరాజు, ఐపీసీ ఆఫీసర్ అర్వపల్లి రాధాకృష్ణ, పర్మినెంట్ ప్రాజెక్టు ఇంచార్జి జొన్నల ఉపేంద్రనాథ్ గుప్తా, చంద్రుపట్ల రోశయ్య, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్స్ యెలుగురి మధుబాబు, సైఫా రాజశేఖర్, దొడ్డ రాజు, తాటిపల్లి సుబ్బారావు, నాగమళ్ళ జయశంకర్, కటకం బాలకృష్ణ, పసుమర్తి వాసు, డోకుపర్తి అంజయ్య, గౌరీశెట్టి కృష్ణ, పాబోలు మణి కిరణ్, చందా చక్రధర్, గందే సురేష్, రామిడి శంకర్, బోనగిరి రమేష్, గ్రంధసిరి నరేందర్, మనోహర్, చారుగుండ్ల జగ్గయ్య, కె కుమార్, జంగాల హరీష్, బోనగిరి కల్పన, కటకం అలేఖ్య, ఎలుగూరి జయశ్రీ, అర్వపల్లి విజయ, పుల్లూరు జ్యోతి, కందే సావిత్రి, పొద్దుటూరి మణి, పాబోలు స్వాతి, తాటిపల్లి కల్పన, సైఫా కళ్యాణి, నాగమళ్ళ సునీత, మహిళా భక్తులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి వేడుక



**చర్ల, నవంబర్ 19: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం స్వర్గీయ మాజీ మహిళా ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ 108వ జయంతి ని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . చర్ల మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నల్లపు దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు దేశానికి చేసినటువంటి సేవలను కొనియాడుతూ గరీబ్ హటావో నినాదంతో బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని బ్యాంకుల జాతీయకరణ పేదలకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టిన ఉక్కు మహిళగా ఆమెకు ఎంతో కీర్తి ఉందని అన్నారు. అనంతరం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో మండల ప్రెసిడెంట్ విజయభాస్కర్ రెడ్డి డివిజన్ నాయకులు చీమలమరి మురళి మాజీ ఎంపీటీసీ మడకం పద్మ విజయ్ నాయుడు సుందరి సురేష్, సతి బాబు రంజిత్ రామారావు చింతియ్య మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమంమే ప్రభుత్వ లక్ష్యం

- **కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 19, ప్రజా జ్యోతి:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగాజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో కుటుంబాలు వయోవృద్ధులను నిర్లక్ష్యం చేసే పరిస్థితులు పెరిగిపోతున్నాయని, ఒంటరితనం, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు వంటి అంశాలు వృద్ధులను బాధిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడానికి జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని తెలిపారు. పోషణ భృతి పొందాల్సిన వృద్ధులకు చట్ట ప్రకారం భృతి అందుకునేలా జిల్లా సంక్షేమ శాఖ, రెవెన్యూ డివిజనల్ అధికారులతో సమన్వయం చేసి వేగవంతమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డుల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నామని, వృద్ధులందరికీ ఆరోగ్య జీవన భీమా పథకాలపై అవగాహన కల్పించడానికి ప్రత్యేక క్యాంపులును నిర్వహిస్తామని తెలిపారు.అదేవిధంగా కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానలో వృద్ధుల కోసం ప్రత్యేక క్యూ లైన్, జిరియాట్రిక్ వార్డ్‌ను ఏర్పాటు చేయించి మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నామని, స్పెషలిస్ట్ డాక్టర్లతో వెల్‌నెస్ సెషన్లు నిర్వహించేందుకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. వృద్ధులను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సైబర్ మోసాలు, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లను అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్‌కు సంబంధించిన పెండింగ్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ వృద్ధుల కోసం ప్రభుత్వం అందిస్తున్న 2016 రూపాయల చేయూత పెన్షన్‌ను క్రమంగా అందజేస్తున్నామని, కొత్త దరఖాస్తుల కోసం ఆన్‌లైన్ వెబ్సైట్ అందుబాటులోకి వచ్చిన వెంటనే ప్రచారం చేసి అర్హులైందరికీ దరఖాస్తు చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. 60 ఏళ్లు నిండిన మహిళలు పదిమంది గ్రూపులుగా ఉన్నట్లయితే వారికి బ్యాంకుల ద్వారా రివాల్యూషన్ ఫండ్స్ అందించే సదుపాయం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులందరూ తప్పనిసరిగా ఆరోగ్య భీమా పొందేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.అనంతరం వృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయోవృద్ధుల అసోసియేషన్ సభ్యులు, వృద్ధుల సంక్షేమానికి సేవలందిస్తున్న వ్యక్తులను సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలు, అభ్యర్థనలు జిల్లా కలక్టర్కు వివరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు సురేష్, సందీప్, కృష్ణయ్య, శివప్రసాద్, యూసఫ్, శివరామ్, భూషణ్ రావు, వెంకటేశ్వర్లు, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, పద్మశ్రీ, వరప్రసాద్, నరేష్, ప్రవీణ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, వయోవృద్ధులు , తదితరులు పాల్గొన్నారు.



## రోడ్ల మరమ్మత్తులకు ఎమ్మెల్యే ఆదేశం మేరకు : ఎంపీడీవోకు వినతి



**ఆళ్ళపల్లి.నవంబర్19.ప్రజాజ్యోతి** ఎమ్మెల్యే రేగ కాంతారావు ఆదేశాల మేరకు, మండల అధ్యక్షులు నరసింహారావు ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రధాన రహదారులు వర్షాల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రజల సౌకర్యార్థం వాటికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని ఈ వినతి పత్రంలో కోరారు. ఎంపీడీవో శ్రీనివాస్ దీనిపై సానుకూలంగా స్పందించి, తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## బాబు క్యాంప్ లో ఉచిత కంటి, మెగా హెల్త్ క్యాంప్



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 19 – ప్రజాజ్యోతి:** ఖమ్మం శరత్ మాక్సివిజన్, హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు బాబు క్యాంప్ నెహ్రూ బొమ్మ నందు ఐఎన్టియుసి చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్కే గౌస్ అధ్యక్షతన ఉచిత కంటి వైద్యం, మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా సింగరేణి సంస్థ ప్రాజెక్ట్ ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు, కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి రజాక్ చేతుల మీదుగా ఉచిత కంటి పరీక్షలు, మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభించడమైనది. రాజ్ మహమ్మద్ జాన్ బి సేవా సంస్థ ఎన్నో మంచి కార్యక్రమాలు చేసి, మనకున్న దాంట్లో పేదలకు దానం చేసి సేవ గుణం అలవర్చుకున్న రజాక్ అండ్ బ్రదర్స్ కుటుంబ సభ్యులకు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ చైర్మన్ పాషా జునైద్, ఫాతిమా రజాక్, ఐఎన్టియుసి నాయకులు ఎస్కే గౌస్, దుర్గారాశి వెంకన్న,పోచం శ్రీనివాస మల్లారపు కొమరయ్య,కే నట్రాజ్, సీతారామరాజు,జల్లి కిరణ్,దాసి రవీందర్, కుంచ సత్యనారాయణ,రవీందర్,నాగరాజు, విశ్వేశ్వరరావు (అమ్ములు) , డి .శ్రీనివాస్, పాషా,రాము,రామకృష్ణ ,శరత్ కంటి,యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ సిబ్బంది ,మిత్రులు,శ్రేయోభిలాషులు ప్రజలు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి...



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 19 – ప్రజాజ్యోతి:** స్థానిక త్రీటౌన్ సెంటర్ లో ఉన్న మొట్టమొదటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఎం ఏ రజాక్ జిల్లా కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకట్ మాదా శ్రీరాములు, సామంతుల శంకర్ కోటేశ్వరరావు పాష భాయ్ బీసీ రాష్ట్ర నాయకులు ప్రసాద్ గారు మిట్టపల్లి సాంబయ్య లాలు కృష్ణ పాల్గొన్నారు. రజాక్, కాసుల వెంకట్ ప్రసంగిస్తూ... భారతదేశానికి మొట్టమొదటి మహిళా ప్రధానమంత్రిగా మూడు పర్యాయములు 1966 నుండి 1977 , 1980 నుండి 1984 నాలుగోసారి మరణం వరకు ప్రధానమంత్రిగా ఉన్నారని దేశ సమగ్రతకు తన చివరి రక్తం బొట్టు ధార పోసారని అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారని సమూలంగా పేదరిక నిర్మూల హరిత విప్లవము బ్యాంకుల జాతీయకరణ జాగీర్దార్ జమీందారుల వ్యవస్థ రద్దు రోటి కపడా ఔర్ మకాన్ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురావటం జరిగినది 1971 వ సంవత్సరం బంగ్లాదేశ్ విముక్తి యుద్ధము దాని ఫలితంగా బంగ్లాదేశ్ ఏర్పడినది అని కొనిఆడినారు.

# జైళ్లు కేవలం నిర్బంధ కేంద్రాలుగా కాకుండా పరివర్తన, నైపుణ్యాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి : రాష్ట్ర జైళ్లశాఖ డీజీ స్వాతి మిశ్రా

**భద్రాచలం, నవంబర్ 19,ప్రజాజ్యోతి :** జైళ్లల్లో ఖైదీల నిర్భందమే కాకుండా వారి పరివర్తన, నైపుణ్యాభివృద్దిని ప్రోత్సహించి వారు కొత్త ఆశలతో సమాజంలోకి వచ్చేందుకు కృషి చేసేవే జైళ్లని రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రా అన్నారు. భద్రాచలంలో బుధవారం ప్రత్యేక సబ్‌జైల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కొత్త అగర్‌బత్తి తయారీ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవిత్ర భద్రాచల దేవస్థానంలో ప్రతిరోజూ సమర్పించే పుష్పాలను సేకరించి, వాటిని బొగ్గు లేకుండా పర్యావరణహిత అగరుబత్తులుగా మార్చడం ఈ యూనిట్ ప్రత్యేకతన్నారు. దేవాలయ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణతో పాటు ఖైదీలకు గౌరవప్రదమైన ఉపాధి కల్పించేందుకు ఈ నమూనా దోహదం చేస్తుందని ఆమె వివరించారు. దేవాలయాల్లో విస్తారంగా ఏర్పడే పుష్ప వ్యర్థాలను విలువైన ఉత్పత్తులుగా మార్చే వేస్ట్ టు వెల్త్ కార్యక్రమం కింద ఖైదీలకు నైపుణ్యాలు నేర్పుతూ స్వీయ అభివృద్ధికి దారితీయగల మార్గమని వివరించారు. ఖైదీలు సమాజంలో తిరిగి బాధ్యతాయుత సభ్యులుగా మారేందుకు అవసరమైన శిక్షణ, క్రమ శిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే జైళ్లశాఖ ప్రధాన లక్ష్యం అని స్పష్టం చేశారు. భద్రాచలంలో ఈ పర్యావరణహిత యూనిట్ ను ఏర్పాటు చేసిన సిబ్బందిని అభినందిస్తూ, ఇలాంటి స్థిరమైన పరిశ్రమలను రాష్టవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కరీంనగర్‌లో ఈ యూనిట్ పని చేస్తోందని, ఈ యూనిట్ ద్వారా ఖైదీలలో క్రమశిక్షణ, పనిపై బాధ్యత, ప్రవర్తనలో సానుకూల మార్పులు స్పష్టంగా కనిపించాయి. భద్రాచలం యూనిట్ కూడా ఇదే నమూనాను అనుసరిస్తూ, ఖైదీలకు శ్రద్ధతో కూడిన శిక్షణ, నిరంతర పని అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుంది. రిఫార్మేషన్, రిహాబిలిటేషన్, రీసోషలైజేషన్ అనే మూడు ముఖ్య స్తంభాలను మరింత బలోపేతం చేయడమే ఈ యూనిట్ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, జైళ్లశాఖ ఐజీ మురళీబాబు, డీఐజీ ఎ.శ్రీధర్, జిల్లా జైళ్లశాఖ అధికారి శ్రీధర్, భద్రాచలం సబ్‌జైలు సూపరింటెండెంట్ ఉపేందర్ పాల్గొన్నారు.




## ఘనంగా ఇంధీరా గాంధీ జయంతి వేడుకలు



**ఇల్లందు, నవంబర్ 19, ప్రజాజ్యోతి:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి 108వ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కూరగాయల మార్కెట్ వద్ద గల పార్టీ కార్యాలయం, కామేపల్లి మండలం పాత లింగాల గ్రామంలోని రాంరెడ్డి వెంకట్ రెడ్డి స్వగృహంలో ఇందిరాగాంధీ చిత్రపటాలకు, జగదాంబ సెంటర్, గోవింద్ సెంటర్‌లోని ఇందిరాగాంధీ విగ్రహాలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంధీరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. గరీబ్ హఠావో అనే నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు ఎంత గానో కృషి చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల దీవెనలతో ఏర్పడిన రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అర్హులైన వారందరికి రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లను ఇస్తు ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రైతు కమిషన్ సభ్యుడు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పట్టణ, మండల, కామేపల్లి మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, గింజల నర్సీ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, మాజీ మున్సిపల్ చైర్మన్లు యదలపల్లి అనసూయ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, చిల్లా శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీమ్, నాయకులు పూనెం సురేందర్, బండి ఆనంద్, ఈసం లక్ష్మణ్, తాటి భిక్షం, మూతి కృష్ణ, పొటు రవి, ఎట్టి హరికృష్ణ, బొల్లి రాజు, వసంతరావు, మాళోత్ బావు సింగ్, పూనెం మధు, ధనసరి రాజు, కల్తి పద్మ, పాయం స్వాతి, పాయం లలిత, దనసరి స్రవంతి, బానోత్ శారద, మడుగు వెంకటలక్ష్మి, గాలిపల్లి స్వరూప, మోకాళ్ళ వెంకటమ్మ, కొక్కు నాగేశ్వరరావు, సుదర్శన్ కోరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో చిన్ననీటి వనరుల గణనను పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 19, ప్రజా జ్యోతి:** జిల్లాలోని చిన్ననీటి వనరుల లెక్కను అత్యంత శాస్త్రీయంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులుకు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దేశవ్యాప్తంగా ఐదేళ్లకొకసారి నిర్వహించే 7వ మైనర్ ఇరిగేషన్ – రెండవ వాటర్ బాడీస్ సెన్సస్ కార్యక్రమాన్ని జిల్లాలో ఎలా అమలు చేయాలన్న అంశంపై జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని చిన్న నీటి పారుదల వనరుల గణనను సమగ్ర ప్రణాళిక ప్రకారం పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా 2000 హెక్టార్లలోపు విస్తీర్ణం గల జలవనరుల గణనను మొబైల్ అప్లికేషన్ ద్వారా మాత్రమే చేపట్టాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. ముందుగా ఒక గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని నమూనా గణన పూర్తిచేసిన అనంతరం మిగతా గ్రామాల్లో గణన కొనసాగించాలని సూచించారు. గ్రామ స్థాయిలో జి పి ఓ, ఏ ఈ ఓ లు, టి ఏ లు , ఫీల్డ్ అసిస్టెంట్లు లను ఎన్యూమరేటర్లుగా పనిచేస్తారని, మండల స్థాయిలో ఏ ఈ విద్యుత్ శాఖ, ఇరిగేషన్ ఏఈ శాఖ , పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ, ఎం ఏ ఓ లు ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో చిన్న నీటి వనరుల గణన కోసం అవసరమైతే ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లను కూడా ఎన్యూమరేటర్లుగా వినియోగించాలని ఆయన సూచించారు. చెరువులు, కుంటలు, వాగులు, లిఫ్ట్ ఇరిగేషన్ నీటి నిల్వ ప్రాంతాలు, బోర్వెల్ కు సంబంధించిన జలవనరులు సహా ప్రతీ నీటి వనరుకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరణ అనివార్యమని ఆయన పేర్కొన్నారు. గణన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ఎన్యూమరేటర్లకు జిల్లా , మండల స్థాయిలో తక్షణ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని, మొబైల్ యాప్ వినియోగం, క్షేత్రస్థాయిలో సమాచారం సేకరణ, వంటి అంశాల్లో స్పష్టమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల పరిధిలో చార్జి ఆఫీసర్స్ అయిన తాసిల్దార్లు, ఎంపీడీవోలు మండల స్థాయి లో సమీక్ష సమావేశాలు నిర్వహించి అవసరమైన సమాచారాన్ని సేకరించి గణన పనులపై సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని ఆయన తెలిపారు. జిల్లాలోని ప్రతి నీటి వనరు భవిష్యత్తు సాగునీటి ప్రణాళికలకు, నీటి సంరక్షణ చర్యలకు ముఖ్య ఆధారమని, కావున ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించి గణనను ఖచ్చితమైన సమాచారం , నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాల్సిన అవసరం ఉంద ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, సి పి ఓ సంజీవ రావు, భూగర్భ జలాల అభివృద్ధి శాఖ అధికారి రమేష్, ఇరిగేషన్ ఈ ఈ అర్జున్, పంచాయతీరాజ్ ఈ శ్రీనివాస్, ఎం పి ఎస్ ఓ లు , సం బంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.